నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

## జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- కలెక్టరేట్ ఏవోకు వినతి

**నవతెలంగాణ-లింగంపల్లి**

మండలంలోని పర్మల్ల గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామ రైతులు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లి.. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఏవో మసూద్ అహ్మద్‌కు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జొన్న పంట సాగుచేసిన రైతులను ఆదుకోవాలని అన్నారు. జొన్నలను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఏవో తెలిపారు.



ఏవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

## అమెరికా ఫార్మ్స్ సందర్శించిన ప్రశాంత్‌రెడ్డి

- పంటల ఆధునిక సాగుతీరు పరిశీలన

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియా రాష్ట్రం ఫ్రెస్నో స్టేట్ యూనివర్శిటీ ఫార్మ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం సందర్శించారు. పంటల ఆధునిక సాగు తీరును ఆయన పరిశీలించారు. ఈ ఫార్మ్‌లో స్వీట్ కార్న్ (తెల్ల మొక్కజొన్న), ఎల్లో కార్న్ (పసుపు మొక్క జొన్న), ఆల్మాండ్ (బాదం), పార్సీ మోన్ పండ్ల తోటల ఆధునిక సాగుతీరును ఆ ఫార్మ్ డీన్ అయిన విన్స్‌రోస్‌ను ప్రశాంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానికురాలు క్యాండీస్, నీరజారెడ్డి, నరేష్‌రెడ్డి, తదితరులున్నారు.



## పనిచేస్తుండగా గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

**నవతెలంగాణ-భిక్కనూర్**

పట్టణంలోని ఉపాధి కూలీ పని చేస్తూ వ్యక్తి మరణించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన మల్లయ్య (66) కూలీ పని చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

# పొరపాట్లకు ఆస్కారం ఉండొద్దు

- కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- శిక్షణ తరగతులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

నిబంధనలను పక్కాగా పాటిస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సీఎంసీ కళాశాలలో జూన్ 4న చేపట్టనున్న నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఎలా చేయాలి, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును ఎలా చేపట్టాలనే అంశాలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి వేర్వేరుగా శిక్షణ అందించారు. పలువురు కౌంటింగ్ సిబ్బంది వ్యక్తపరిచిన సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకోవాలని, రాండమైజేషన్ జరిపిన మీదట ఆ జాబితాను అనుసరిస్తూ వారికి ఆయా నియోజకవర్గాల వారీగా టేబుళ్లను కేటాయించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం నిజామాబాద్ అర్బన్, రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 20 టేబుళ్లు, మిగతా ఐదు నియోజకవర్గాలకు 18 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బంది అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా సమయం వృథా చేయకూడదని, అదే సమయంలో పొరపాట్లకు ఆస్కారం ఉండకుండా పూర్తి అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతిరౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యధాతథంగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించబడిన ప్రతి ఒక్కరూ వారివారి విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, అనుమానాలకు, గందరగోళాన్ని తావిచ్చేలా వ్యవహరించకూడదని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు అనుమతించబడవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే సహాయ రిటర్నింగ్ అధికారులను సంప్రదించి వారి దృష్టికి తేవాలని అన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ సూపర్వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయని, సిబ్బందికి అల్పాహారం, భోజనాల కోసం కూడా తగిన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా నిబంధనలను పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని హితవు పలికారు. శిక్షణ తరగతులలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, డీపీఓ చక్రవర్తి తరుణ్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగురోజులుగా నీళ్లు వస్తలే

- సమస్యను పరిష్కరించాలని రాస్తారోకో

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

తమకు నాలుగు రోజుల నుంచి తాగునీరు రావడం లేదని మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీ వాసులు తెలిపారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని బోధన్, హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. తాగునీరు రావడం లేదని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీవాసుల బైఠాయింపుతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తాగునీరు సరఫరా అయ్యే విధంగా చూస్తామని హామీనివ్వడంతో రాస్తారోకోను విరమింపజేశారు.

**నీటి సమస్య పరిష్కారం..**

మండల కేంద్రంలో గల సాయినగర్ కాలనీలో నీటి సమస్య పరిష్కరించినట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. మంగళవారం ఉదయం తాగునీరు రావడం లేదని మండల కేంద్రంలో బోధన్ మెదక్ రహదారిపై మహిళలు రాస్తారోకో నిర్వహించారు. వెంటనే స్పందించిన సంబంధిత అధికారులు ఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించి నీటిని సరఫరా చేశారు. మోటార్ పంపు రెండు చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తిందని, ప్రస్తుతం తాగునీటి సమస్య తీరినట్లు ఆయన పేర్కొన్నారు. బోరు మోటర్ పంపును ఎంపీఓ పర్వన్న, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య పరిశీలించారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న కాలనీ వాసులు

### సాలూర చెక్‌పోస్టులో

## ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీ

- రూ.13,519 నగదు స్వాధీనం

**నవతెలంగాణ-బోధన్**

సాలూర మండల కేంద్రంలోని అంతరాష్ట్ర చెక్ పోస్టులో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏసిబి డిఎస్పి శేఖర్ నేతృత్వంలో ఉదయం నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ శేఖర్ మాట్లాడుతూ ఏసిబి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చెక్‌పోస్టులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ముందుగా సాలూర చెక్‌పోస్టులో జరుగుతున్న తతంగంపై ఏసీబీ సిబ్బంది రెక్కీ నిర్వహించారని తెలిపారు. ఇందులో భాగంగా వాహనదారులు పర్మిట్ కోసం చెక్‌పోస్ట్ సిబ్బందికి డబ్బులు ఇవ్వడం, కొంతమంది టేబుల్‌పై డబ్బులు పెట్టడం పరిశీలించినట్లు తెలిపారు. చెక్‌పోస్టులో అవినీతి జరుగుతున్నట్లు నిర్ధారించి ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీలో రూ.13,519 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల సమయంలో కంప్యూటర్ ఆపరేటర్, ఒక హెడ్ కానిస్టేబుల్ విధులలో ఉన్నారని, ఏఎంవీఐ శ్రీకాంత్ విధులలో లేకపోవడంతో ఆయనను పిలిపించి మరింత తనిఖీలు చేపట్టి విచారించినట్లు తెలిపారు. ఏసీబీ తనిఖీలు జరుగుతున్నట్లు కూడా పలువురు వాహనదారులు పర్మిట్ కోసం రావడం గమనార్హం. తనిఖీల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నగేష్, వేణు, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

## కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి కూలి

- కామారెడ్డి జిల్లా జడ్పీ సీఈవో చందర్‌నాయక్

**నవతెలంగాణ-జుక్కల్**

కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి కూలి చెల్లిస్తామని కామారెడ్డి జిల్లా జడ్పీ సీఈవో చందర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని కేమ్రాజ్‌కల్లాలి, బస్వాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేమ్రాజ్‌కల్లాలీ, బస్వాపూర్ గ్రామాల్లో పల్లెప్రగతిలో నిర్వహించిన నర్సరీల పెంపకం, శ్మశాన వాటికలు, క్రీడామైదానాలు, వనాలు, కంపోస్ట్‌షెడ్, డంపింగ్ యార్డ్, గ్రామ పరిశుభ్రతలపైన దృష్టి సారించాలని జడ్పీ సీఈవో అన్నారు. అనంతరం బస్వాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి కూలి వస్తుందని సూచించారు. కూలీల సంఖ్య పెంచాలని గ్రామప్రత్యేక అధికారులకు, ఉపాధిహామీ టీఏలను ఆదేశించారు. రికార్డుల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. గ్రామ ప్రజల సమస్యలు ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని చెప్పారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని తెలిపారు. నర్సరీలలో మునగకాయ, ఉసిరి వంటి మొక్కలు నర్సరీలలో పెంపకం చేపట్టి రాబోయే హరితహారంలో నాటాలని ప్రత్యేకాధికారులకు సూచించారు. జడ్పీసీఈవో, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ యాదగిరి, కేమ్రాజ్‌కల్లాలీ జీపీ సెక్రెటరీ శ్రీనివాస్, బస్వాపూర్ జీపి సెక్రెటరీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చందర్‌నాయక్



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న పలువురు

## గంగమ్మ బ్రిడ్జి పరిశీలన

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండలంలో గంగమ్మ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎంపీపీ దశరథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. 'నత్త నడకన బ్రిడ్జి పనులు' అనే శీర్షికన నవతెలంగాణలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చొరవతో, మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేసి, టెండర్ నిర్వహించినా.. కాంగ్రెస్ ప్రభుత్వం పనులను పట్టించుకోకపోవడంతో బ్రిడ్జి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా నడుస్తున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం వర్షాలు కురియకముందే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి చేయకపోతే నిరసనలతో, ధర్నాలతో ప్రజల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారులకు చరవాణిలో బ్రిడ్జి పనులపై సమాచారం అందించి, వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింబాద్రి నాయక్, జంగం లింగం, బొమ్మేడి సాయిరెడ్డి, సుధాకర్, సుమన్, మహిపాల్, శంకర్, నరసింహులు తదితరులున్నారు.

# ఖరీఫ్ సాగుకు సిద్ధం

### వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు..

**నవతెలంగాణ-ఆర్మూర్**

ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. తమ పంట పొలాలను దుక్కులు దున్ని, నల్ల మట్టితో చదును చేసుకుని సిద్ధం చేసుకుంటున్నారు. అధిక దిగుబడులు రావడానికి ఇతర చోట్ల నుండి నల్ల మట్టిని పొలాలకు తరలించి చదును చేసుకుంటున్నారు. పచ్చి రొట్టెను పెంచడానికి జీలుగా విత్తనాలను పొలాల్లో విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరో కొద్ది రోజులలోనే మృగశిర కార్తె ప్రారంభం కానున్నందున రైతులు వాన రాక కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. బోరు బావుల్లో నీరు ఉన్న రైతులు సాగుకు ముందే సిద్ధం అవుతుండగా, మిగతా రైతులు తొలకరి జల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే వ్యవసాయ శాఖ రైతుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో జీలుగా విత్తనాలతో పాటు వరి, మొక్కజొన్న, సోయాబీన్ విత్తనాలను అందుబాటులో ఉంచారు. అలాగే ఎరువులను సైతం సిద్ధంగా ఉంచారు. జీలుగా విత్తనాలను అవసరమున్న రైతులకు రాయితీపై అందజేస్తున్నారు.

జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌లో 5,52,128 ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 4,30,550 ఎకరాలలో వరి పంట సాగుచేయనున్నారు. కాగా వరి 1,29,165 క్వింటాళ్లు, మొక్కజొన్నకు 3,353 క్వింటాళ్లు, సోయాబీన్‌కు 15,443 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నట్లు అంచనా వేసింది. వీటితో పాటు పెసరకు 10 క్వింటాళ్లు, పత్తికి 6,546 అవసరం కానున్నవి.

**అన్ని అందుబాటులో..**



జిల్లా వ్యవసాయాధికారి ఆదేశానుసారం ఖరీఫ్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు సొసైటీలలో అందుబాటులో ఉంచాం. రైతులు బ్యాచ్ నెంబర్ ధర కలిగిన నాణ్యమైన ప్యాకెట్ విత్తనాలే కొనాలి. బిల్లులు, విత్తన ప్యాకెట్లను పంట చేతికొచ్చే వంకు జాగ్రత్తగా పెట్టుకోవాలి. ఖరీఫ్ సాగుకు వివిధ రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– హరికృష్ణ, మండల వ్యవసాయ అధికారి ఆర్మూర్.


**రైతన్నల సంక్షేమం కోసం**



సీడ్స్ కార్పొరేషన్‌తో పాటు మార్కెట్ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కూడా విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. భూసారం పెంచేందుకు రైతులు జీలుగా, పచ్చిరొట్టను అధికంగా వాడుతున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాస్థాయి అధికారుల సూచనల మేరకు సొసైటీ పరిధిలోని రైతులకు నిర్విరామ సేవలు అందిస్తున్నాం.

– బంటు మహిపాల్, పిఏసిఎస్ చైర్మన్, గోవింద్‌పేట్.





### మండల పరిధిలో..

ఆర్మూర్, ఆలూర్ మండలాలను కలిపి ఖరీఫ్ సీజన్‌కు గాను 30,000 వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నట్లు అధికారుల అంచనా వేశారు. మొత్తం వరి విస్తీర్ణం 35 వేల ఎకరాల కాగా 22 నుంచి 23 ఎకరాలలో వరి పంట, పసుపు ఐదు వేల ఎకరాలలో, సోయాబీన్, మక్క 2000 ఎకరాలలో సాగు చేయనున్నారు. సాగు చేయనున్న పంటలకు అనుగుణంగా అధికారులు విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. అధికారులు సొసైటీల పరిధిలో వరి, మొక్కజొన్న, సోయాబీన్ విత్తనాలను రైతుల కోసం అందుబాటులో ఉంచారు. వ్యవసాయ బోరు బావుల వద్ద సాగునీరు ఉన్న రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. గత సంవత్సరం మార్కెట్‌కు పంట తక్కువ రావడంతో పసుపు పంటకు డిమాండ్ పెరిగింది. గత ఏడాది పసుపు క్వింటాలుకు రూ.15 నుంచి 18 వేల ధర పలికింది. దీంతో రైతులు పసుపు పంట సాగుపై దృష్టి పెట్టారు. పలు గ్రామాలలో పసుపు పంట సాగు పెరిగే అవకాశం ఉంది. ఈసారి కూడా ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం నుంచి సీజన్ ముగిసే వరకు వివిధ పంటల సాగుకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా సన్న రకం వరి ధాన్యం క్వింటాలుకు 500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో సన్న రకం వరి ధాన్యంతో పాటు దొడ్డు రకం వరి ధాన్యానికి కూడా క్వింటాకు రూ.500 ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

## పాఠశాలల్లో పనులు నాణ్యతతో చేపట్టాలి

- మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుందర వరద రాజన్

**నవతెలంగాణ-మెండోరా**

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను నాణ్యతతో చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుందర వరద రాజన్ అన్నారు. మంగళవారం పాఠశాలల్లో పనులను ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించి ఏఏపిసి కమిటీలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, పీఆర్ ఏఈ నాగేశ్వర్, ఏపిఎం విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ

నవతెలంగాణ
2
నిజామాబాద్
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

## దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం


అడిషన్‌ల్ కలెక్టర్‌ను సన్మానించిన పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

భువనగిరి అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొంగి గంగాధర్‌ను జిల్లా దేవాంగ విద్యా కమిటీ మంగళవారం పట్టణంలో వారిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా కమిటీ అధ్యక్షులు గోపాల వినాయక్ మాట్లాడుతూ మరెన్నో ఉన్నత ఉద్యోగాలు చేపట్టి అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పసుపుల రఘునాథ్, చంద్రమోహన్, పసుపుల భూమేశ్వర్, బోనికే రాము, మోహన్ పాల్గొన్నారు.

## నగరంలో విత్తన దుకాణాలు తనిఖీ


తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారిని

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ నగరంలోని గోదాం రోడ్డులో గల విత్తన డీలర్ షాపులను మండల వ్యవసాయాధికారి సౌమ్య తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి డీలర్ దగ్గర ఏ రైతుకు ఏ విత్తనాలను అమ్ముతున్నారు?, ఏ రకపు విత్తనాలను అమ్ముతున్నారు?, ఏ కంపెనీకి సంబంధించిన విత్తనాలను అమ్ముతున్నారో అన్ని అంశాలను ఇన్వైస్‌లో పొందుపరచి బిల్లును రైతులకు అందించాలని సూచించారు. అదేవిధంగా రైతులకు అమ్మే విత్తనాల ఇన్వాయిస్ వివరాలను ప్రత్యేకంగా డీలర్ షాప్‌ల వద్ద ఉండే రిజిస్టర్‌లో పొందు పరచాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్వేత పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా బీసీల కులగణన చేపట్టాలి


మాట్లాడుతున్న బిఎల్‌పి నాయకులు

**నవతెలంగాణ-బాల్కొండ**

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా బీసీల జనాభా దామాషా ప్రకారం కులగణన చేపట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ నాయకుడు అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల బహిరంగ సభలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల గణన జరిపిస్తామని మాట ఇచ్చారని దీనిని వెంటనే అమలు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తను కూడా బీసీ అని చెప్పుకొని బీసీలకు చేసింది ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఎందుకు ఏర్పాటు చేయలేదని అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పార్టీలు బీసీలను విద్యా ఉద్యోగ, రాజకీయ రంగాలలో ఎదగనీయకుండా చేస్తున్నాయని, బీసీల ఓట్ల కోసం బీసీలను వాడుకుంటున్నాయని, బీసీలు అందరు ఇప్పటికైనా మేలుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ నాయకులు జగదీశ్వర్, బీసీ నాయకులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో నిమగ్నం


వ్యవసాయ పనులు చేస్తున్న యువకులు

**నవతెలంగాణ-మోపాల్**

మోపాల్ మండలంలోని తనకుర్తి గ్రామంలో గల యువకులు వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నారు. బీటెక్ చదువుతున్న విద్యార్థులు కళాశాలకు వేసవి సెలవులు ఉండటంతో స్వగ్రామానికి వచ్చారు. వారి తల్లిదండ్రులకు వ్యవసాయ పనిలో ఎంతో కొంత సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ఇలా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కళాశాలలకు హాలిడేస్ వస్తే చాలామంది విద్యార్థులు వివిధ ప్రాంతాలను సందర్శించేందుకు వెళ్తున్న ప్రస్తుత కాలంలో ఈ గ్రామ యువకులు మిగతా వారికి ఆదర్శంగా ఇలా తల్లిదండ్రులకు ఆసరగా పొలం పనులు చేయడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

## జీలుగా విత్తనాలు పంపిణీ



జీలుగా విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

భీంగల్ మండల పరిధిలోని రైతు సేవా కేంద్రం ఆగ్రోస్ పురానిపేట్‌రోడ్, ముచ్కూర్ సొసైటీలో రైతులకు జీలుగా విత్తనాలు పంపిణీ చేశారు.

## అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి


ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-భీంగల్**

మండలంలోని బెజ్జోరా గ్రామ శివారులో గల కప్పల వాగు నుండి కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నరసయ్య, జెడ్పిటిసి చౌటుపల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ శ్రీలత, ఎస్సై హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. భీంగల్, బడాభీంగల్ గ్రామ పరిధిలో గల కప్పల వాగు నుండి ప్రభుత్వ అనుమతులతో ఇసుక పాయింట్‌లు నడుస్తుండగా బెజ్జోరా శివారు నుండి రాత్రి వేళలో పెద్దపెద్ద టిప్పర్లు, ట్రాక్టర్లల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని కనుక రవాణాను అరికట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్, పురానిపేట ఎంపీటీసీ సాయి, కౌన్సిలర్‌లు సతీష్‌గౌడ్, నరసయ్య, నాయకులు స్వామి, ప్రసాద్, రాజేశ్వర్, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్మికులంతా

# సంఘం నిర్మాణానికి పూనుకోవాలి

- సంఘటిత శక్తితో వ్యవసాయ కార్మికులు ఐక్యం అవ్వాలి
- అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.రామకృష్ణ



మాట్లాడుతున్న ఏఐపీకేఎంఎస్ నాయకులు

**నవతెలంగాణ-సిరికొండ**

వ్యవసాయ కార్మికులంతా సంఘం నిర్మాణానికి పూనుకోవాలని, సంఘటిత శక్తితో వ్యవసాయ కార్మికులు ఐక్యం అవ్వాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఉపాధి కూలీలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రస్తుత పరిస్థితుల్లో కూలీలంతా సంగటితమై పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలు ఐక్యం అవ్వకుంటే మనుగడ సాగించడం కష్టమన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ మోడీ కోటీశ్వరులకు కొమ్ముకాస్తు వారి ప్రయోజనాలకే చౌకీదారునని నిరూపించుకున్నారన్నారు. బ్యాంకుల్లో ప్రజల సొమ్మును కొల్లగొట్టిన బడా బాబులకే 18 లక్షల కోట్లు మాఫీ చేశాడే గాని అన్నదాత అయిన రైతుల రుణాలు మాత్రం మాఫీ చేయలేదని వివరించారు. దేశంలో చమురు ధరలు, వంట గ్యాస్, నిత్యావసర ధరలు పెద్ద ఎత్తున పెంచి పేదల కడుపు కొడుతున్నాడని అన్నారు. పిల్లలు తాగే పాలను సైతం జీఎస్టీలోకి చేర్చిన గణుడు మోడీ అన్నారు. వ్యవసాయ కూలీలు నేడు అన్నమో రామచంద్ర అనాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. దేశంలో 16కోట్ల మంది, రాష్ట్రంలో 80 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉన్నారన్నారు. భూమిలేని పేదల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుందని, మరోవైపు ఉపాధి కరువై వలసలు వెళ్లాల్సిన దయనీయమైన స్థితి నెలకొన్నదని వివరించారు. వ్యవసాయ కూలీలను ఓట్ల కోసమే వాడుకోవడం తప్ప వారి సంక్షేమం పట్ల ఏనాడు పట్టించుకోలేదన్నారు. అంతిమంగా వ్యవసాయ కూలీలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటమే ఏకైకమార్గం తప్ప మరొకటి లేదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపికేఎంఎస్)నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యులు ఈ.రమేష్ అధ్యక్షత వహించగా.. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, (ఏఐపీకేఎంఎస్) జిల్లా సహాయ కార్యదర్శి సాయరెడ్డి, నాయకులు బి.కిషోర్, సిపిఐ(ఎంఎల్) ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు ఆర్.దామోదర్, మండల కమిటీ సభ్యులు లింబాద్రి, కిషోర్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

### పోరాటాల ఫలితమే

# బీడీ కార్మికుల మూల వేతనాల పెంపు

- ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేష్

**నవతెలంగాణ-సిరికొండ**

పోరాటాల ఫలితమే బీడీ కార్మికుల మూల వేతనాల పెంపు అని, పోరాటాల ఫలితంగా బీడీ యాజమాన్యం మూలవేతనాలు పెంచుతూ అగ్రిమెంట్ చేసుకున్నారని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో గల యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల అగ్రిమెంట్ 25.4.24తో ముగిసిందని, నూతన వేతనాల ఒప్పందం గురించి బీడీ కంపెనీ యజమానులతో డిమాండ్ లెటర్ ఇవ్వగా యాజమాన్యం అగ్రిమెంట్ చేసుకున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ, కార్మిక సంఘాలు, కలిసి వేతన ఒప్పందకోసం చర్చలు జరిపి దీని ప్రకారంగా బీడీలు చుట్టే కార్మికులకు వేతనం 4.25పై పెంచినది, మొత్తం 1000 బీడీలకు మొత్తం కలిపి 49.98 పైసలు అయిందని వివరించారు. బీడీ ప్యాకింగ్ కార్మికుల నూతనంగా 3650 నెలకు రూపాయలు, చేటన్, బట్టివారి, చెన్నివల, ట్రై ఫిల్లర్స్, క్లర్క్‌కు 1700/బి పెంచారు. ఈ వేతన ఒప్పందం బీడీ యజమానులు, బీడీ కార్మిక సంఘాలు శాంతియుతంగా చర్చలు జరిపి పరిష్కరించినట్లు వివ రించారు. మే 20, 24నుంచి ఈ నూతన ఒప్పందం అమలు కావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ భీంగల్ ఏరియా అధ్యక్షురాలు రమ, ఏరియా నాయకులు ఆర్.పుష్పలత, మల్కి మణెమ్మ, లావణ్య, లత తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

- మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్
- 13 పాఠశాలలు తనిఖీ


పాఠశాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మాదాపూర్, పుప్పాలపల్లి, కేశ్‌పల్లి, చింతలూర్, కలిగోట్ తదితర గ్రామాలలోని పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి సందర్శించి పాఠశాలకు మరమ్మతులకు సరిపడా బడ్జెట్ ఉందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులను, నీటి సౌకర్యాన్ని, విద్యుత్ సౌకర్యాన్ని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అన్ని వసతులు కల్పించవలసి ఉంటుందని తెలియజేశారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ఏఈ సురేంద్ర వర్మ, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలి

- టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి


నిజామాబాద్: ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళర్పిస్తున్న నాయకులు


ముప్కాల్‌లో...

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ ముప్కాల్**

ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని పట్టణ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ కోరారు. నందమూరి తారక రామారావు 101 జయంతి వేడుకలు నిజామాబాద్ పార్లమెంట్ పరిధి జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయ స్థలంలో తెలుగుదేశం జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఇంచార్జి వినోద్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మహోన్నోతమైన వ్యక్తి అని అన్నారు. తెలుగు ప్రజలకు అసలైన స్వాతంత్ర్యం లభించింది కేవలం ఎన్టీఆర్ వలన అని అన్నారు. ప్రపంచ నలుమూలల తెలుగువారికి ఒక అరుదైన గుర్తింపు లభించడం కేవలం ఆయన వలన సాధ్యమైందని అన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్ అర్బన్ ఇంచార్జ్, జనరల్ సెక్రెటరీ రేంజర్ల సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, మల్లరెడ్డి, లవంగ రాజు, గంగోని రాజేశ్వర్, రవికుమార్ పాటిల్, బాలాజీ గౌడ్, చెరుకు గంగాధర్, కటికే గణేష్, రమేష్, మహిళ నాయకురాలు లక్ష్మీ యాదవ్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**ముప్కాల్ :** మండల కేంద్రంలో మంగళవారం ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలను మండల కేంద్ర వాసులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన స్మృతులను గుర్తుచేసుకున్నారు. మండలంలోని వెంచిర్యాల, రెంజర్ల, కొత్తపల్లి, నాగంపేట్ గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు రాజకీయ నాయకులు, యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కప్పల వాగును పరిశీలించిన రెవెన్యూ అధికారులు


వాగును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

**నవతెలంగాణ-భీంగల్**

మండలంలోని బెజ్జోర గ్రామ పరిసరాలలో గల కప్పల వాగును తహసీల్దార్ శ్రీలత మంగళవారం పరిశీలించారు. రాత్రి వేళలో బెజ్జోరా పరిసరాలలో గల కప్పల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ధనుంజయ్ ఉన్నారు.

## బాగేపల్లి గ్రామాభివృద్ధిపై సమీక్ష


మాట్లాడుతున్న పలువురు

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని బాగేపల్లి, కూనేపల్లి గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి, స్థానిక ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామాల అభివృద్ధిపై మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆ గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత, వీధిదీపాల ఏర్పాటు, మురికి కాలువలు శుభ్రం చేయడం, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జి.శ్రీకాంత్, కూనేపల్లి గ్రామ కార్యదర్శి శివకృష్ణ, కారోబార్ మహేష్, అంగన్వాడి టీచర్ సరోజ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# శిలీంద్రం వాడకంపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శృతి

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో పసుపు పంట వేసే రైతులకు నిజామాబాద్ జీవ నియంత్రణ ప్రయోగశాల ఏవో శృతి పసుపు పంటలో ట్రైకోడర్మ విరిడే శిలీంద్రం వాడకం, ఉపయోగాలపైన రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిలీంద్రం పసుపులో వచ్చే దుంపకుళ్ళు, సోయాబీన్, మొక్కజొన్నలో వచ్చే ఎండు తెగులును కలిగించే శిలీంద్రాన్ని మొక్క వేరు చుట్టూ వృద్ధి చెందకుండా చేసి తెగులును రానీయకుండా చేస్తుందని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు.

**విత్తన శుద్ధి..**

పొడి మందుగా ఒక కిలో పసుపు విత్తనానికి 10 కిలోలు, నీటిలో కలిపి వాడడం కోసం ఒక ఎకరానికి విత్తనంకు 100 లీటర్ల నీటిలో అరగంట పాటు విత్తనాన్ని ముంచి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలన్నారు.

**భూమిలో చల్లు విధానం..**

100 కిలోల బాగా మాగిన సేంద్రియ ఎరువులో 5 కిలోల ట్రైకోడేర్మ విరిడే బాగా కలిపి నీడలో 12 నుంచి 15 రోజులు మాగనివ్వాలన్నారు. ప్రతి 5 రోజులకి ఒకసారి బెల్లం కలిపిన నీటిని మిశ్రమంపై చల్లి కలపాలని, 12 రోజులకు శిలింద్రం అభివృద్ధి చెందిన తరువాత మొక్క వెర్లకు అందుబాటులో ఉండేలా ఒక ఎకరా భూమిలో తేమ వునపుడు చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, గ్రామ రైతులు బద్దం చిన్నారెడ్డి, బద్దం రమేష్ రెడ్డి, బద్దం తిరుపతి రెడ్డి, ఏనేడ్ల ప్రసాద్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ బోనాలు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండలంలోని మేంగారం గ్రామంలో రేణుక ఎల్లమ్మకు గౌడ కులస్తులు మంగళవారం బోనాలు తీశారు. గ్రామానికి చెందిన గౌడ కులస్తులు ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుసప్పులతో పోతరాజుల విన్యాసం, శివసత్తులు పూనకాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి నైవేద్యం సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వేడుకల్లో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## సిద్ధ రామేశ్వర చండీ హెూమ కార్యక్రమం


చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-భిక్కనూర్**

పట్టణంలోని దక్షిణ కాశీ శ్రీసిద్ధ రామేశ్వర ఆలయంలో ఉడిపి పూజారుల చేత పట్టణానికి చెందిన సీనియర్ హైకోర్టు న్యాయవాది రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎనిమిదవ రోజు త్రికాల పూజ, చండీ హెూమ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వాస్తు హెూమ కార్యక్రమంలో లోక కళ్యాణం కోసం పూజా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, పట్టణ ప్రజాప్రతినిధులు మైపాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, భక్తులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

## గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే

# విత్తనాలు కొనుగోలు చేయండి

- మండల వ్యవసాయాధికారులు
- విత్తనాల కొనుగోళ్లపై అవగాహన


నాగిరెడ్డిపేట్ : విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి


గాంధారిలో..

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**నాగిరెడ్డిపేట్ :** వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి విజయ శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాఘవపల్లి, తాండూర్ గ్రామాలలో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేటప్పుడు ప్యాకింగ్ ఉన్న సంచులను మాత్రమే తీసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణంలో రసీదు తప్పనిసరిగా తీసుకోని రసీదు భద్రపరచాలన్నారు. ప్రస్తుత కాలంలో నకిలీ విత్తనాలు అక్కడక్కడ వెలుగు చూస్తున్నాయని రైతులు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పిన నియమ నిబంధనలు పాటించి విత్తనాలను కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు నికిత, రాజశేఖర్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**విత్తనాలు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి..**

**గాంధారి :** విత్తనాలు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి విజ్ఞేష్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రైతులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు తీసుకొనేటప్పుడు పలు సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ :** బీబీపేట మండల కేంద్రంతో పాటు ఇస్సానగర్, యాడరం గ్రామాలలో ఏఈవోలు సాగర్, లత, రాఘవేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు విత్తనాలు కొనుగోలుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో సాగర్ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు వ్యవసాయ శాఖ నుంచి అనుమతి ఉన్న సీడ్స్ విత్తనాల షాపులలో మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పనిసరి కొనుగోలు చేశాక వాటికి సంబంధించిన రశీదులు తీసుకోవాలని తెలిపారు. విత్తనాల ఖాళీ సంచులను పంట కాలం ముగిసేవరకు రైతులు తమ వద్దే భద్రపరచాలని రైతులకు సూచించారు. కార్యక్రమాన్ని ఏఈఓ రాఘవేంద్ర, లత రైతులు ఉన్నారు.

**పోతంగల్ :** మండలంలోని జల్లాపల్లి గ్రామంలో వ్యవసాయాధికారి సుప్రియ రైతులకు వివిధ పంటలపై మంగళవారం అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలో సహకార సంఘ విత్తన కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు.


దోమకొండలో..


పోతంగల్‌లో..

## రైతుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న రైతులు

**నవతెలంగాణ-గాంధారి**

మండల కేంద్రంలో నూజివీడు సీడ్స్ కంపెనీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రైతుల సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు సీడ్స్ అధ్వర్యంలో రైతు సమ్మేళనం మార్కెటింగ్ సీనియర్ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానా కాలంలో సాగుచేసే పత్తి, మొక్కజన్న, వరి పంటలపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అవలంబించి అధిక సాంద్రత పద్దతిలో పత్తి సాగుచేయాలన్నారు. నూజివీడు సీడ్స్ వారి నూతన మొక్కజొన్న విత్తనాలు మొక్కజొన్నలో అధిక దిగబడినిచ్చే క్యాప్సుల్, క్రాంతిలను రైతుల అధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్తమ రైతులు ఏఎస్ఎమ్ జైకుమార్, గాంధారి ఎంఓ భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు అమ్మాలి

- విత్తనాల డీలర్లతో ఏవో సమావేశం


విత్తన దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారి

**నవతెలంగాణ-మద్నూర్**

మండలంలో మద్నూర్ రైతు వేదికలో మద్నూర్, డోంగ్లి మండల విత్తన, ఎరువు డీలర్లతో సమావేశం మంగళవారం నిర్వహించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తన బిల్‌బుక్, స్టాక్ రిజిస్టర్, విత్తనాలు, ఎరువులు ఎక్కడ నుంచి తెచ్చారో వాటి వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. మద్నూర్, మెనూర్ గ్రామాల్లో పలు దుకాణాలను పరిశీలించి రైతులకు ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని, అమ్మిన వాటికి రసీదు తప్పకుండా ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి రాజు డీలర్లకు తెలిపారు. కార్యక్రమంలో మద్నూర్ డోంగ్లి మండల డీలర్లు, ఏఈఓలు పాల్గొన్నారు.

## నరేష్‌కు బెస్ట్ ట్రైనర్ అవార్డు




అవార్డు అందుకుంటున్న నరేష్

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఇంటికొక స్పీకర్, ఊరికి ఒక్క ట్రైనర్ అన్న నినాదంతో ప్రతి ఒక్కరిని చైతన్య పరుస్తూ ఇంపాక్ట్ ఫౌండేషన్ ఏర్పడిందని కామారెడ్డికి చెందిన పూడూరి నరేష్ అన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఇన్పెక్ట్ ఫౌండేషన్ ద్వారా ఉత్తమ శిక్షకుడిగా తనకు అవార్డు లభించిందన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ, సినీ నిర్మాత గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్మించిన ట్రైన్ ది ట్రైలర్ వర్క్ షాప్‌లో ఈనెల రోజులపాటు జరిగిన శిక్షణ తరగతులకు హాజరై పిఎంజెఎఫ్ మదన్మోహన్ (డిస్టిక్ క్యాబినెట్ నెంబర్) చేతుల మీదుగా తాను ఇంఫ్యాక్ట్ సర్టిఫైడ్ ట్రైలర్ ధృవపత్రం అందుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు, యువతకు మంచి నైపుణ్యత అభివృద్ధి, ఒక మంచి మార్గదర్శకులు తీర్చిదిద్దడమే తన బాధ్యతను పెంచిందని, తనలాగ ఇంకా ఎంతో మంది శిక్షకులుగా తయారై సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. తనకు అవకాశం కల్పించిన నల్గొండ, నీలగిరి 161 బ్యాచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నూనె సుదర్శన్, మోటార్స్ డైరెక్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాలను సందర్శించి కేంద్ర బృందం


ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

**నవతెలంగాణ-కామారెడ్డి**

వివిధ మండలాల్లోని గ్రామాలను కేంద్ర ఆహార పౌరసరఫరాల శాఖ బృందం ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. బిబిపేట మండలం మాందాపూర్, దోమకొండ మండలం అంబారిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు సందర్శించారు. రైతులను అకాల వర్షాల కారణంగా నష్టపోయిన వివరాలను అరా తీశారు. రాజంపేట్ మండలం తలమడ్ల గ్రామాన్ని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ బృందం ప్రతినిధులు సందర్శించి అకాల వర్షాల వల్ల కలిగిన పంట నష్టం వివరాలను సేకరించారు. నష్టపోయిన పంట గింజలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు, పౌరసరఫరాల శాఖ ఇంచార్జి మేనేజర్ నిత్యానందం, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**నవతెలంగాణ-వర్ని**

మండల కేంద్రంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహాన్ని పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు చేశారని సంక్షేమ పథకాలు ఒక్క రూపాయి రేషన్ బియ్యం అందజేసిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. రాజకీయ రంగంలో కూడా ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్, నామాల సాయిబాబా, బుజ్జి, హైమద్ బాయ్, శివ నాగేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సురేందర్‌రెడ్డి

**నిజమైన నాయకులు ఎన్‌టిఆర్.. టిడిపి రాష్ట్ర కార్యదర్శి విఠల్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో నిలిచి ప్రజాసేవలో ముందంజలో ఉండి నాయకుడంటే ఇలా ఉండాలని ఆదర్శంగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకల సందర్భంగా శ్రీనగర్ గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ నాయకులు


మాట్లాడుతున్న నాయకులు

**నవతెలంగాణ-మద్నూర్**

మారుమూల ప్రాంతంలో గల వెనుకబడ్డ జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతరావుకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. 1957 సంవత్సరంలో జుక్కల్ నియోజకవర్గం సెగ్మెంట్‌గా ఏర్పడిందని, 1978లో జుక్కల్ ఎస్సీరిజర్వ్ నియోజకవర్గంగా మారిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి నియోజకవర్గానికి రాలేకపోతుందని ఇప్పుడున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మంచి విద్యావంతుడు, అనుభవం ఉన్న వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్‌పటేల్, గంగాధర్, రమేష్, రాజు విజ్ఞప్తి చేశారు.

## అటవీ భూమి దున్నుతున్న ట్రాక్టర్ సీజ్


ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఫారెస్టు అధికారులు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండలంలోని కన్నాపూర్ తండా చెందిన శివలాల్‌కు చెందిన ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసి స్థానిక పోలీస్టేషన్లో అతనిపై ఫిర్యాదు చేసి పోలీసులకు అప్పగించినట్టు నాగిరెడ్డిపేట్ ఎఫ్ఆర్ వాసుదేవ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండలంలోని కన్నాపూర్ తండాకు చెందిన శివలాల్ గత వారం రోజులుగా గ్రామ సమీపంలోని కంపార్ట్‌మెంట్ నెంబర్ 688లో అక్రమంగా అటవీ భూమిని దున్నుతున్నారు. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. పలుసార్లు ట్రాక్టర్‌ను పట్టుకోవడానికి ప్రయత్నాలు చేసిన తప్పించుకు తిరుగడంతో మంగళవారం ఎఫ్ఆర్ఓ వాసుదేవ్ ఆధ్వర్యంలో బేస్ క్యాంప్ నాగిరెడ్డిపేట్ అటవీశాఖ సిబ్బంది, కామారెడ్డి అటవీ శాఖ స్పెషల్ టీం సభ్యులు కన్నాపూర్ తండాలో ఆయన నివాస గృహం వద్ద ఉన్నటువంటి ట్రాక్టర్‌ను పక్క ప్రణాళికతో చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో శివలాల్ తప్పించుకుపోయాడు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అభివృద్ధి అధికారి

**నవతెలంగాణ-నిజాంసాగర్**

మండలంలోని జక్కాపూర్ గ్రామపంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పనులు, నర్సరీ కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి గంగాధర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు 200 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యే విధంగా తగు ప్రణాళిక చేయాలని ఆయన పంచాయతీ కార్యదర్శికి సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేయాలని ఆయన కూలీలకు సూచించారు. నర్సరీలో ఉదయం సాయంత్రం నీటిని మొక్కలకు పట్టాలని అన్ని బెడ్ల యందు మొక్కలు పెరగాలని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయన పంచాయితీ కార్యదర్శికి ఆదేశించారు. కార్యక్రమంలో జక్కాపూర్ పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ హేమచందర్ మంగళవారం తెలిపారు. మొదటి, రెండవ సంవత్సరం రుసుము లేకుండా ఉచితంగా ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులు మండల కేంద్రంలో గల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపులలో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన అన్నారు. వివరాల కోసం 9848345450, 9491314050 నెంబర్లకు సంప్రదించాలని ఆయన అన్నారు.

## విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులను అందజేయాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

**నవతెలంగాణ-భీంగల్**

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందజేసే స్కూల్ యూనిఫామ్‌ను సకాలంలో అందజేయాలని డిఆర్‌డిఓ సాయగౌడ్ ఆదేశించారు. మంగళవారం మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన బాధ్యతకు అనుగుణంగా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు సకాలంలో వాటిని కుట్టి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సంతోష్, ఏపీఎం రవీందర్, సీనియర్ సీసీ కుంట శ్రీనివాస్, నరేష్, సాయిలు, గడాల రఘుపతి, భాస్కర్, గంగలలిత, గంగాధర్ మహిళ సభ్యులున్నారు.

## నందిపేట్ మోడల్ స్కూల్లో హాస్టల్ సౌకర్యం కల్పించాలి

**నవతెలంగాణ-నందిపేట్**

మండల కేంద్ర సమీపంలో గల పలుగుట్ట వద్ద మోడల్ స్కూల్లో హాస్టల్ సదుపాయం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు హాస్టల్ వసతులు లేక స్కూలుకు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టల్ వసతి సదుపాయం కల్పిస్తే తమ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని వారు అంటున్నారు. కేజీబీవీల అధికారులు తాత్కాలికంగా మోడల్ స్కూల్ హాస్టల్‌ల బాధ్యతలను చూడాలని ఆదేశాలు ఉన్నప్పటికీ హాస్టల్ నిర్వహణను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చూసేవారు. అయితే తమ జాబ్‌చార్ట్‌లో ఈ విధులు లేవని ప్రిన్సిపాల్స్ కోర్టును ఆశ్రయించారు. వారికి అనుకూలంగా తీర్పు రావడంతో విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని, ఇకనైనా 2024-2025 విద్యా సంవత్సరానికి హాస్టల్ సదుపాయాలను కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతి



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ప్రముఖ కవి,రచయిత అమరజీవి సురవరం ప్రతాపరెడ్డి 128వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యాలయంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. 1896 మే 28న మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాలపాడులో జన్మించారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనలో తెలుగువారి అణచివేతను నిరసిస్తూ సురవరం ప్రతాపరెడ్డి ప్రజలను చైతన్య పరచడం కోసం తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, పారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులైన ఆయన.. గోల్కొండ పత్రిక దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలు స్థాపించి సంపాదకుడిగా పత్రిక రచయితగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. వనపర్తి శాసనసభ్యులుగా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు పి.రంజిత్, రాధాకుమార్, ప్రకాష్, ఆనంద్ పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం


విహారిక

**నవతెలంగాణ-బాల్కొండ**

ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాదారి చిన్నయ్య కూతురు విహారిక (20) ఈ నెల 27 న ఆర్మూర్‌లోని సాహితి ఇన్స్టిట్యూట్ నందు టైలరింగ్ నేర్చుకుందామని శ్రీరాంపూర్ నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దాంతో మంగళవారం బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఆమె తల్లి గాదారి గోదావరి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బాల్కొండ ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

## మహిళ రైతులకు పసుపు పంటపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పలువురు

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

పండించిన పసుపు పంటను ఏ విధంగా అమ్ముకోవాలనే దానిపై అవగాహన కల్పించినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్సీడెక్స్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫోన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొనసాగుతున్న సంస్థ ద్వారా మహిళ పసుపు రైతులకు అవగాహన కల్పించారు. ఉమెన్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కోపరేటివ్ సొసైటీ మహిళ పసుపు రైతులకు ఎన్సిడెక్స్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫౌండ్ ట్రస్టు ప్రతినిధి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. పసుపు పండించిన తర్వాత ఏ విధంగా అమ్ముకోవాలి, పసుపుపంట మద్దతు ధర ఏ విధంగా పొందాలి, ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన ఎన్‌సిడిఎక్స్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ట్రస్టు ద్వారా ఆన్లైన్లో పసుపు క్వింటాలుకు ఎంత అమ్ముకోవాలో ఎంత వస్తుందో తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల తయారీకి ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఏపిఎం రవీందర్ రెడ్డి


మాట్లాడుతున్న ఏపిఎం రవీందర్‌రెడ్డి

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

ఏకరూప దుస్తుల తయారీకి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏపిఎం రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో ఏకరూప దుస్తుల తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫీ యాక్టివిటీస్‌తో పాటు ఏకరూప దుస్తుల తయారీకి మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పిస్తూ స్కూల్ ప్రారంభం కంటే ముందే దుస్తులు అందే విధంగా ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదు తప్పకుండా తీసుకోవాలి


కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు


మాక్లూర్‌లో..


రెంజల్‌లో...

- రైతులకు సూచించిన వ్యవసాయాధికారులు
- విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**కమ్మర్‌పల్లి :** మండలంలోని ఉప్లూర్, దొమ్మరి చౌడు తాండా, ఇనాయత్‌నగర్, చౌట్‌పల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు విత్తనాలు కొనుగోలు చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సవివరంగా తెలియజేశారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, అలాగే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యేవరకు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రసీదు, విత్తన సంచి జాగ్రత్తగా ఉంచాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎస్.సాయిరాం, రాజు, జి.రమేష్, మొగిలి పద్మ, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**మాక్లూర్ :** మండలంలోని కిందితండా, మాక్లూర్ గ్రామంలో విత్తనాల కొనుగోలుపై రైతులకు మండల వ్యవసాయ అధికారిని పద్మ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించిందని, లూజుగా ఉన్న సంచులలో విత్తనాలను కొనుగోలు చేయవద్దని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్ బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని, వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, ప్యాక్ చేసిన, లేబుల్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రంజిత్, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సై సుధీర్‌రావు, మండల వ్యవసాయాధికారి పద్మ కలిసి పలు పెస్టిసైడ్స్ షాప్‌ల్లో తనిఖీలు నిర్వహించారు.

**నకిలీ విత్తనాలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన..**

**రెంజల్ :** తెలంగాణలో ఈమధ్య నకిలీ విత్తనాలు పెద్ద మొత్తంలో వచ్చి చేరినట్లు తమ దృష్టికి వచ్చిందని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు డీలర్ల నుంచి రసీదులు తప్పకుండా తీసుకోవాలని వ్యవసాయాధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని బోర్గాం, కిసాన్ తండా, రెంజల్, పేపర్‌మిల్ గ్రామాలలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు దృష్టికి వస్తే పార్టీ డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పంట చేతికొచ్చేవరకూ విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను భద్రంగా తమ వద్ద ఉంచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అజయ్, కవిత, ప్రసాద్, కృష్ణవేణి, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

- ఏఐకేఎంఎస్ డిమాండ్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంట క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఏఐకేఎంఎస్ డిమాండ్ చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడిఏ పిపి అనితకు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. రబి సీజన్ పూర్తి అయి మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ (వానకాలం) పంటలు ప్రారంభమవుతాయని, జిల్లాలో ఎన్ని ఎకరాలలో ఏఏ పంటలు వేయాలో అందుకుగాను పంటల ప్రణాళిక ప్రకటించి, రైతు పంట క్యాలెండర్‌ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట, జీలుగా ఎస్సీ, ఎస్టీ రైతులకు సన్న చిన్న కారు రైతులకు ఉచితంగానూ మిగతా రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేయాలని కోరారు. ఎరువులపై పెరిగిన రేట్లను ప్రభుత్వమే భరించాలన్నారు. విత్తనాలపై ఎత్తివేసిన సబ్సిడీని ప్రభుత్వం కొనసాగించాలని తెలిపారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల పంటలకు దొడ్డు వడ్ల కూడా 500 రూపాయలు బోనస్ ధర ఇవ్వాలన్నారు. 2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, ఇంకా అక్కడక్కడ మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని అన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. పంటలపై రైతులను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అందుకుగాను ఆత్మ నిధులతో ఇతర ప్రాంతాలలో పంటలను పరిశీలించేందుకు గాను రైతులను టూర్లకు తీసుకువెళ్లాలని, దీనితోపాటు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను తెలిపేందుకు వ్యవసాయ రంగ నిపుణులతో రైతు సదస్సులు రైతులను చైతన్య పరిచే క్లాసులను నిర్వహించి వారిని చైతన్య పరచాలని అన్నారు. సీజన్‌కు ముందు అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు ఎంఎస్పి ముందే ప్రకటించాలని, పంట పెట్టుబడిలో అధికంగా కలిపి ఇవ్వాలని తదితర డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తడకల కృష్ణగౌడ్, హగ్గు ఎర్రన్న, బి.సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.పరువయ్య, బి.దేవస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు కే గోపాల్, గూండ్ల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

## చెరువులో పడి పశువుల కాపరి మృతి


మృతి చెందిన దుర్గయ్య

**నవతెలంగాణ-మాక్లూర్**

మండలంలోని రామచంద్రపల్లి గ్రామంలోని చెరువులో పడి పశువుల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జ్వాల దుర్గయ్య (65) అనే పశువుల కాపరి రోజులాగే సోమవారం పశువులు కాపేందుకు వెళ్లాడు. సాయంత్రం గేదెలకు చెరువులో నీరు తాగించేందుకు వెళ్లి.. గేదెలతో పాటు చెరువులో దిగాడు. దీంతో నీటమునిగి ఊపిరాడక మృతిచెందాడు. కాగా.. మంగళవారం ఉదయం శవాన్ని బయటకు తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు వర్ని మండల సర్వసభ్య సమావేశం

**నవతెలంగాణ-వర్ని**

మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి సమక్షంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## వికలాంగులకు రాయితీపై బస్‌పాస్

- వికలాంగుల సమన్వయకర్త శ్రీరామ్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

వికలాంగులకు రాయితీపై బస్‌పాసులు పంపిణీ చేయనున్నట్టు ఐకెపి వికలాంగుల సమన్వయకర్త శ్రీరామ్ తెలిపారు. ఈనెల 30న మండల కేంద్రంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో ఆర్టీసీ ఆధ్వర్యంలో రాయితీపై బస్సు పాసులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన వికలాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో పాటు రూ.50 తీసుకొని రావాలని సూచించారు.

# ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ గజానన్

**నవతెలంగాణ-ఆర్మూర్**

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ గజానన్ హెచ్చరించారు. పట్టణంలోని కోటార్మూర్‌లో రూ.2 కోట్ల విలువ గల ప్రభుత్వ భూమిని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా స్వాధీనం చేసుకున్నారు. కోటార్మూర్‌లోని సర్వే నంబర్ 31లో 1089 గజాల (9 గుంటల) స్థలాన్ని మొదట వెంచర్‌లో కలుపుకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు యత్నించారు. ఫిర్యాదు అందడంతో సుమారు రూ.2కోట్ల విలువగల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందించి రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మండల సర్వేయర్ షికారి రాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) అశోక్‌సింగ్, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి (టిపిఓ) ప్రవీణ్ కలిసి 31వ సర్వే నంబర్‌లో జాయింట్ సర్వే చేశారు. అధికారులు సర్వే చేయడంతో ఈ సర్వే నంబర్‌లో 1089 గజాల (9 గంటల) స్థలం ఉన్నట్లు గుర్తించారు. స్థలాన్ని గుర్తించి హద్దులు పాతారు. 1089 గజాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ ప్రకటించారు. అక్కడే పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఈ స్థలం చుట్టూ కంచె వేయడానికి ఎస్టిమెంట్ తయారు చేస్తామన్నారు. తొందరలో కంచె వేసి ప్రభుత్వ భూమి అని బోర్డును పెడతామని చెప్పారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న నివేదికను జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు పంపిస్తామన్నారు. వీరి వెంట మున్సిపల్ సిబ్బంది రాంసింగ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


భూమిని సర్వే చేస్తున్న అధికారులు

## పెస్టిసైడ్స్ దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని పెస్టిసైడ్స్ దుకాణాలను స్థానిక వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో కల్తీ విత్తనాలు పెద్ద మొత్తంలో రావడంతో, వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు పొందిన పెస్టిసైడ్స్ దుకాణాలలో విక్రయించే ధాన్యం స్టాక్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో డీలర్ల వద్ద కచ్చితంగా రసీదులను తీసుకోవాలని, పంట కాలం పూర్తయ్యే వరకు పట్టి రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికతో పాటు, స్టాక్ వివరాలను సూచిక బోర్డుపై రాయాలని డీలర్లను ఆయన ఆదేశించారు. మండలంలో లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రసాద్, అజయ్, వెంకటేశ్వర ఫర్టిలైజర్ యజమాని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు

- బోధన్ పట్టణంలో మజ్జిగ పంపిణీ

**నవతెలంగాణ-బోధన్**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం బోధన్ పట్టణంతో పాటు పెంటకుర్దు, జాడిజమాల్‌పూర్, సాలురా క్యాంప్ తదితర గ్రామాల్లో జయంతి ఉత్సవాలను తెలుగు దేశంపార్టీ నాయకులు కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. పెంటకుర్దు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాడి, సాలురా క్యాంప్‌లలో ఎన్టీఆర్ చిత్రపటాల వద్ద పూలు సమర్పించి ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. బోధన్ కొత్త బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సీహెచ్ వి.హన్మంతరావు, టీడీపీ బోధన్ ఇంచార్జ్ గోపాల్‌రెడ్డి, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివనారాయణ, టీడీపీ నాయకులు పావులూరి వెంకటేశ్వరరావు, సచిన్ పటేల్, విట్టల్ పటేల్, ఉదయ్ భాస్కర్, విశ్వేశ్వర్‌రావు, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు రంగారావు, గాంధీ, వడ్లమూడి వెంకటేశ్వరరావు, సిద్ధాపూర్ సూరిబాబు, నల్గొండ వెంకటేశ్వరరావు, కర్నాటి రామకృష్ణ, అచ్చన్‌పల్లి విజయ్, రత్నాకర్, మువ్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన పలువురు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి ట్రాక్టర్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో రాంపూర్ గ్రామవాసి ధ్యావల లచ్చవ్వ (40) మృతి చెందగా ఈ ప్రమాదాన్ని తెలుసుకున్న తెలంగాణ వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జె.సత్యనారాయణ, వైస్ చైర్మన్ అంతయ్య మంగళవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని తక్షణ సహాయర్థం రూ.10,000 వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. పోస్టుమార్టం జరిగే వరకు వారి బంధువులకు అండగా నిలిచి ఓదార్చి మనోధైర్యాన్ని ఇస్తూ సానుభూతి తెలిపారు. వీరితోపాటు నియోజకవర్గ ఇన్చార్జ్ సంపంగి నాగయ్య, రాంపూర్ సర్పంచ్ కిషన్, పలువురు గ్రామస్తులు మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు.

## జోరుగా ఇసుక అక్రమ రవాణా

**నవతెలంగాణ-నిజాంసాగర్**



మండలంలోని వివిధ గ్రామాలకే కాకుండా వివిధ మండలాలకు ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. బిచ్కుంద మండలంలోని హస్గుల్, పుల్కల్ తదితర మంజీర పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమ రవాణా చేపడుతున్నారు. అయినా అధికారులు దృష్టి సారించకపోవడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు ఇసుకను భారీగా సరఫరా చేశారు. ఒక్క ట్రాక్టర్ ఇసుక ధర రూ.5500 నుంచి 6000 వరకు విక్రయించారు. దీని ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం గండిపడే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని స్థానికులు తెలిపారు.

# కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- **సీఈఓ వికాస్ రాజ్**

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి ఆయా పార్లమెంటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా చేపట్టాల్సిన చర్యల గురించి సీఈఓ సూచనలు చేశారు. మలి విడత ర్యాండమైజేషన్ జరిపి, ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని కేటాయించాలని అన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల వరకు అందరూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకునేలా చూడాలని, ఈ మేరకు అభ్యర్థులు, వారి తరఫున హాజరయ్యే ఏజెంట్లకు కూడా సమాచారం అందించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభించాలని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన అన్ని సదుపాయాలు కౌంటింగ్ సెంటర్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని, జనరేటర్‌ను సైతం అందుబాటులో ఉంచాలని సూచించారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు మినహా ఇతరులు ఎవరూ కౌంటింగ్ కేంద్రం లోనికి సెల్ ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, అవసరమైన పక్షంలో రీకౌంటింగ్ నిర్వహణ గురించి సిబ్బందికి శిక్షణ తరగతుల సందర్భంగా స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా, సాఫీగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పంపించాలని, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించే సమయంలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. సీ.సీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరగాలని, కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. తుది ఫలితాల వెల్లడి తరువాత కౌంటింగ్ సెంటర్ వద్ద పక్కాగా ఆంక్షలు అమలయ్యేలా చూడాలని, పూర్తిస్థాయిలో నిబంధనలకు లోబడి సంబరాలు నిర్వహించుకునేందుకు మాత్రమే అనుమతించాలని అన్నారు. ఎలాంటి అనుమానాలు, వివాదాలు, గందరగోళానికి తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, అధికారులు

## కుంటలో పడి యువకుడు మృతి

**నవతెలంగాణ-పిట్లం**

ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై నిరేష్ కథనం ప్రకారం మండల కేంద్రంలోని బుడగ జంగం కాలనీకి చెందిన విభూతి రమేష్ (29) పిట్లం గ్రామంలోని ఎలిమేని కుంటలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి ఈత రాకపోవడంతో నీట మునిగి ఊపిరి ఆడక మరణించాడు. మృతుని చిన్న నాన్న విభూతి పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మెప్మా ఆర్‌పి ఆత్మహత్య ?

**నవతెలంగాణ-భీంగల్**



వాసంతి (ఫైల్)

భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన వాసంతి(35) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. భీంగల్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్‌పిగా పనిచేస్తున్న ఆమె మంగళవారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**నవతెలంగాణ-లింగంపేట్**



ప్రశాంత్ (ఫైల్)

మండలంలోని కోర్పోల్ గ్రామానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కోర్పోల్ గ్రామానికి చెందిన ప్రశాంత్(24) గత కొన్ని సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రశాంత్ సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని నీటి కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు తిరిగి రాకపోవడంతో రాత్రి చుట్టుపక్కల వెతికారు. గ్రామ సమీపంలోని నీటి కుంటలో శవమై కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి తల్లి లక్ష్మి ఉంది.కుటుంబ సభ్యులకు ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఫిర్యాదు చేసింది నేనే'

**నవతెలంగాణ-మద్నూర్**

మండలానికి చెందిన ఒక నాయకుడు తనకు డబ్బులు ఇవ్వాలని వేధిస్తూ డబ్బులు ఇవ్వనందుకు తనపై తప్పుడు ఆరోపణలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని పశు వైద్యుడు చేసిన ఆరోపణకు మండల నాయకుడు స్పందించాడు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదు చేసింది నేనే అంటూ ఆ నాయకుడు ముందుకు వచ్చాడు. డబ్బులు ఇవ్వనందుకు నాపై ఫిర్యాదు చేస్తూ మానసికంగా ఒత్తిళ్లకు గురి చేస్తున్నట్లు చేసిన ఆరోపణలో ఎలాంటి నిజం లేదని తాను డబ్బులు అడిగినట్లుగా ఆ వైద్యుడు నిరూపించాలని సవాల్ విసిరాడు.

## నేటి నుండి జీలుగా, జనుము విత్తనాలు పంపిణీ

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని అన్ని సొసైటీలలో జీలుగా, జనుము విత్తనాలను బుధవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రజాపతి మంగళవారం తెలిపారు. జీలుగ 30 కేజీల బస్తా ధర రూ.1116, జనుము 40 కేజీలు బస్తా ధర రూ.1448/ ఉందని వివరించారు.

## ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తా

- **వ్యాపారవేత్త తిమ్మయ్య గారి సుభాష్‌రెడ్డి**

**నవతెలంగాణ-దోమకొండ**



ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని వ్యాపార వేత్త సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంచనూర్ గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళ్యాణోత్సవంలో ముఖ్య అతిథిగా జడ్పిటిసి తిర్మల్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం వ్యాపార వేత్త సుభాష్ రెడ్డి, జడ్పీటీసీ తిర్మాల్ గౌడ్‌ను గౌడ సంఘం సభ్యులు, నాయకులు శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచులు స్వామిగౌడ్, మట్టి శ్రీనివాస్, వెంకట్ గౌడ్, వెంకట రమణాగౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌కు షోకాజ్ నోటీస్



షోకాజ్ నోటీస్ అందజేసిన అధికారులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నగరంలోని ఖలీల్‌వాడీలో గల అయ్యప్ప స్కానింగ్ సెంటర్, ఐ హాస్పిటల్‌లో గతంలో స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన అమాయక మహిళలతో అశ్లీల కార్యకలాపాలు, రాసలీలలు, వారిని మోసం చేసిన ఘటన వార్తలు పత్రికలలో వచ్చిన సమాచారం మేరకు, అదేవిధంగా సిపిఐ(ఎంఎల్) నాయకుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ స్పందించారు. అందులో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య బృందం సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి అయ్యప్ప స్కానింగ్ సెంటర్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసును అందజేశారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నలుగురు వైద్య నిపుణులు జీజీహెచ్‌లోని గైనకాలజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ అనుపమ, రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణి, నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ అంజన, ఎంసిహెచ్ సర్వీసెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య చేత ఒక కమిటీని వేశారని, ఈ కమిటీ త్వరితగతిన స్పందించి 7 పని దినాలలో రిపోర్ట్‌ను సబ్మిట్ చేయాలని, వారు ఇచ్చిన రిపోర్టుని కలెక్టర్‌కు సమర్పించి, తదుపరి చర్యలు జిల్లా కలెక్టర్ తీసుకుంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.

### ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల

# షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి

- **టిఎస్ యుటిఎఫ్ నాయకుడు మల్కా జనార్ధన్**

**నవతెలంగాణ-భీంగల్**

సీఎం ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఉపఎన్నిక ముగిసినందున ఎన్నికల కమిషన్ అనుమతితో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సడలింపు తీసుకుని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని టిఎస్ యుటిఎఫ్ నాయకుడు మల్కా జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు టీఎస్‌యుటిఎఫ్ జాక్టో ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం జరిపిన చర్చల్లో ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని వెంటనే షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పి నేటివరకు ఎన్నికల సంఘానికి ప్రభుత్వం నుండి లేఖ పంపకపోవటం విచారకరమని అన్నారు.

తొమ్మిదేళ్ళుగా పదోన్నతులు, ఆరేళ్ళుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతున్నదని, ఉపాధ్యాయుల పదోన్నతులకు ఏర్పడిన న్యాయపరమైన ఆటంకాలన్ని తొలగిపోయినందున గత అక్టోబర్‌లో అర్థాంతరంగా నిలిపివేసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పున్నప్రారంభించాలని, గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్స్ అందరినీ రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను కూడా వెబ్ కౌన్సిలింగ్ ద్వారా వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని జనార్ధన్ డిమాండ్ చేశారు.

# వేతనాలు పెరగడంతో సంబురాల్లో బీడీ కార్మికులు

**నవతెలంగాణ-కామారెడ్డి**

బీడీ కార్మికులకు ప్యాకర్లకు, బట్టి, చాటన్ తదితర కార్మికులకు వేతనాలు పెరిగిన సందర్భంగా రెండు రోజుల సంబరాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ ఆధ్వర్యంలో, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్బినగర్, చిన్న మల్లారెడ్డి, భవానీపేట్, బీడీ సెంటర్లలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేయు దాదాపు 8లక్షల మంది బీడీ కార్మికులకు, బీడీ ప్యాకర్లకు, బట్టి, చటన్, నెలసరి ఉద్యోగులు తదితరులుకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి, మూల వేతనాలు పెంచాలని గతంలో చేసుకున్న ఒప్పందం తేదీ-31-4-2024,న ముగిసినందున తేదీ1-5-2024, నుంచి నూతన ఒప్పందం బీడీ యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసుకోవాల్సి ఉండగా, బీడీ యాజమాన్యం దిగివచ్చి, తేదీ 25-5-2024న హైదరాబాద్‌లో 7గంటల పాటు చర్చలు జరిపి తమకు మూల వేతనాలను పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.నగర్ శివసాగర్, చక్రపాణి, రాజు, పురుషోత్తం, ప్రతాప్‌రెడ్డి, మర్కండయ్య, రాజు, కిషన్, స్వామి, పెంటయ్య, బాల్ కిషన్, ఖాదిర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

# పంచాయతీ భవనాలు కరువు

- **పాఠశాలల్లోనే పంచాయతీ పాలన**
- **నిధులు ఉన్న నిర్మాణంలో జాప్యం**

**నవతెలంగాణ-లింగంపేట్**

కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేక గ్రామపంచాయతీ పాలన పాఠశాలల భవనాల్లోనే కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలల దిశగా రూపుదిద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. జూన్ 14 వరకు విద్యా సంవత్సరం గాను పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని నిధులు మంజూరు చేసింది. కానీ సగానికిపైగా పాఠశాలలో గ్రామపంచాయతీ కార్యాలయాల పాలన వ్యవస్థ ఉండడంతో అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసివేసిన పాఠశాలను తెరిపించాలని ఆదేశాలు జారీ చేయడంతో అడుగడుగున పంచాయతీ పాలన పాఠశాలకు అడ్డంగా మారుతుంది. విద్యార్థుల బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గ్రామపంచాయతీ పాలన ప్రతి గ్రామపంచాయతీకి సొంత భవనం నిర్మాణం చేపట్టాలని గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఇప్పటివరకు నిర్మాణం చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో కొంతమంది కాంట్రాక్టర్లు ముందుకు వచ్చినా.. ధరలు పెరగడంతో నిర్మాణం చేపట్టడానికి ముందుకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అర్థాంతరంగా గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణంలో నిలిచిపోయాయి. గత ప్రభుత్వం 200 జనాభా ఉన్న తాండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ పాలన కొనసాగించడానికి సొంత భవనాలు లేకపోవడంతో గ్రామంలోని పాఠశాలల్లో పాలన కొనసాగిస్తున్నారు. సొంత భవనాలు లేక పంచాయతీ పాలకవర్గ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామసభలో సమావేశాలు నిర్వహణ, పంచాయతీ దస్త్రాలు భద్రపరచడం చాలా కష్టంగా ఉందని పలుచోట్ల ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా భవన నిర్మాణ పనులు

**పాఠశాలల్లో పంచాయతీ పాలన..**

గ్రామపంచాయతీ పాలనకు పంచాయతీ భవనాలు కరువవడంతో ప్రభుత్వ పాఠశాలలో లేదా అంగన్వాడీ కేంద్రాల్లో గ్రామపంచాయతీ పాలన కొనసాగుతుంది. జిల్లాలో వెయ్యికిపైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 120పైగా పాఠశాలల్లో పంచాయతీ పాలన కొనసాగుతుంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బోధనకు అడ్డంకులు ఎదురవుతున్నాయి.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం గ్రామపంచాయతీలో 526 ఉన్నాయి. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం 204 అనుబంధ గ్రామాలను గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పంచాయతీ పాలన కొనసాగించడానికి గ్రామాల్లోని ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసి పాలన కొనసాగిస్తున్నారు. నూతనంగా గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టడానికి జిల్లావ్యాప్తంగా 170 గ్రామ పంచాయతీలకు రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద 160 గ్రామపంచాయతీలకు ఎస్‌టిఎఫ్‌డిఎఫ్ 10 పంచాయతీలకు నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరైనా.. నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. 100పైగా గ్రామపంచాయతీ భవనాలు నామమాత్రంగా పనులు చేపట్టి కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు.

**నిధులు ఉన్న నిర్మాణంలో జాప్యం..**

ప్రస్తుతం గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. లింగంపేట మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 26గ్రామ పంచాయతీలకు భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు బాయంపల్లి, అయ్యపల్లి, రాంపూర్, జగదాబ తండా లోనే గ్రామపంచాయతీ భవనాలు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి సబ్ డివిజన్లో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ 70 గ్రామపంచాయతీలకు భవనాలు నిర్మాణం చేపట్టాలని నిధులు మంజూరు అయినా ఇప్పటివరకు రెండు నుంచి మూడు గ్రామపంచాయతీలు పనులు పూర్తిస్థాయిలో జరిగిన దాఖలాలు లేవు. మరికొన్ని పునాదులకు, కొన్ని స్లాబ్‌లకే పరిమితమయ్యాయి. గ్రామపంచాయతీ పాలన వ్యవస్థ పంచాయతీ రికార్డులు భద్రంగా ఉంచుకోవడానికి వసతి లేక కార్యదర్శులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామపంచాయతీ సమావేశాలు, పాలకవర్గం సమావేశాలు, గ్రామ సభలు నిర్వహించేందుకు స్థలం లేక ఆరు బయటనే కూర్చోవలసిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టి అందులోకి మార్చాలని పలువురు కోరుతున్నారు.

**బిల్లు రావడం లేదు**

రాంపూర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపట్టిన ఇప్పటివరకు బిల్లు రాలేదు. నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్న బిల్లు కోసం ఎదురుచూస్తున్నాం.

**- కిషన్‌జి, రాంపూర్**

**బిల్లు రాక సంవత్సరమైంది**

అయ్యపల్లి తండాలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణం చేపట్టి సంవ్సతరం అయినా బిల్లు రాలేదు. అప్పులు చేసి గ్రామపంచాయతీ నిర్మాణం చేపడితే ఇప్పటివరకు బిల్లులు రాలేదు. రూ.15 లక్షల వరకు అప్పులు చేశాం.

**- జిలియా నాయక్, మాజీ సర్పంచ్**

**నిర్మాణం చేపట్టడానికి ముందుకు రావడం లేదు**

గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టడానికి ఎవరు ముందుకు రావడం లేదు. బిల్లుల పంపిణీలో జాప్యం జరిగిన మాట వాస్తవమే. త్వరలోనే బిల్లులు మంజూరు చేస్తాం.

**- గిరిజి, పంచాయతీరాజ్ డిఇ, ఎల్లారెడ్డి**